సాక్షి
శ్రీకాకుళం

గురువారం । 2 । నవంబర్ । 2023



కళలకు ఊపిరి

శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య కళాకారులను ప్రోత్సహిస్తోంది. సుమారు పాతికేళ్లుగా కళలను ఆదరిస్తోంది. - 10లో



పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

అమరజీవి త్యాగం చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. జిల్లావ్యాప్తంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. - 10లో

7న వాహన విడిభాగాల వేలం

శ్రీకాకుళం క్రైమ్ : ఎచ్చెర్లలోని జిల్లా ఆర్మ్‌డు రిజర్వ్, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో పోలీసు వాహనాలకు సంబంధించిన విడి భాగాలను ఈ నెల 7న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్పీ జి.ఆర్.రాధిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 99890 74783 (యూనిట్ మెకానిక్), 63099 90841 (ఆర్ఐ, ఎంటీవో, ఏఆర్) నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

5, 6 తేదీల్లో పౌరాణిక ప్రదర్శనలు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో వైజయంతి ఉత్సవ వేదికపై ఈ నెల 5, 6 తేదీల్లో పలు పౌరాణిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ బుధవారం తెలిపారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు మాయాబజార్, సోమవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీనివాస కల్యాణం పౌరాణిక ప్రదర్శనలు జరుగుతాయని, శ్రీవినాయక నాట్యమండలి, సురభి థియేటర్స్, తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆదుకున్న 108 అంబులెన్స్



సపర్యలు చేస్తున్న సిబ్బంది

మందస : మారుమూల ప్రాంతాల్లో 108 వాహనాల సేవలు అద్భుత సేవలు అందిస్తూ ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్నాయి. మందస మండలం చీపి పంచాయతీ బొందికరి అనే మారుమూల గిరిజన గ్రామానికి చెందిన సవర రిస్వధినికి బుధవారం పురిటినొప్పులు మొదలయ్యాయి. అందుబాటులో వైద్యం లేకపోవడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. కొద్ది సమయంలోనే వాహనం చేరుకుని, గర్భిణిని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా.. మందస సమీపంలో పురిటినొప్పులు అధికం కావడంతో ఈఎంటీ బి.తారకేశ్వరరావు, పైలట్ కె.శ్రీనివాస్‌లు ప్రాథమిక చికిత్స అందజేశారు. ఆడ శిశువు మెడకు బొడ్డుతాడు చుట్టుకోవడంతో వేరు చేసి తల్లీ, బిడ్డకు ఊపిరి పోశారు. అనంతరం హరిపురం సీహెచ్‌సీలో చేర్పించారు. క్షేమంగా కాపాడిన సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ భేష్..!



వైద్య సిబ్బందితో అమెరికా బృందం

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రజారోగ్యమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, సీకేడీ(క్రోనిక్ కిడ్నీ డిసీజ్) ప్రోగ్రాం సత్ఫాలితాలు ఇస్తుండటంతో కింగ్‌జార్జ్ ఇన్‌స్టిట్యూట్ (అమెరికా) బృంద పరిశీలకులు డాక్టర్ కేసీ జాన్ ముఖ్యమంత్రి జగన్ పాలన భేష్ అంటూ అభినందించారు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లిలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్, సీకేడీ ప్రోగ్రాంను పరిశీలించారు. వైద్యులు, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య పరీక్షలు, మందులు, కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీకేడీ ప్రోగాం మేనేజర్ డాక్టర్ గుమ్మడి బాలాజీ, సూపర్‌వైజర్ సత్యనారాయణ, సీకేడీ రీసెర్చ్ కౌన్సిలర్ దిలీఫ్, వైద్యాధికారి కనిష్క్, చక్రధర్, తమ్మినాన దుర్యోధన, సిబ్బంది పాల్గొన్నారు.

జైలు ముద్దాయిల కేసులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జైలు ముద్దాయిల కేసుల సత్వర పరిష్కారానికి పోలీసు, ఎక్సైజ్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో అండర్ ట్రయల్ ప్రిజనర్స్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు త్వరితగతిన చార్జ్ షీట్ ఫైల్ చేయాలన్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, ఫణికుమార్, జిల్లా న్యాయ సేధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, మెజిస్ట్రేట్‌లు శారదాంబ, శ్రీవిద్య, భరణి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ఏఎస్పీ తిప్పేస్వామి, జైలు సూపరింటెండెంట్ నబీఖాన్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ మెట్ట మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సహాయం ముసుగులో

స్వాహాయణం



తిత్లీ సహాయం ముసుగులో పచ్చ బ్యాచ్ పాల్పడిన మరో స్వాహాయణం వెలుగు చూసింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ కుంభకోణం లోకాయుక్త విచారణలో బట్టబయలైంది. అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు సూత్రధారిగా, అప్పటి పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ పాత్రధారిగా జరిగిన ఈ అక్రమ బాగోతంలో పశు వైద్య శిబిరాలు, మందులు, వ్యాక్సిన్ల పేరుతో భారీగా నిధులు కొల్లగొట్టారు.





- తిత్లీ తుఫాన్ నష్ట పరిహారం కొట్టేసిన పచ్చనేతలు
- అధికారుల రీ సర్వేలో బట్టబయలైన బినామీల బాగోతం
- వెలుగులోకి టీడీపీ హయాంలో జరిగిన పశు కుంభకోణం
- లోకాయుక్తకు వెళ్లిన ఫిర్యాదుతో బయటపడ్డ అవినీతి
- నాటి మంత్రి అచ్చెన్నాయుడు అండతో చెలరేగిన అప్పటి జేడీ వెంకటేశ్వర్లు
- రికవరీకి ఆడిట్ అధికారుల సిఫారసు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: తిత్లీ తుఫాన్ సమయంలో జరిగిన మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. టీడీపీ హయాంలో తుఫాన్ అనంతరం చేపట్టిన సహాయక చర్యల ముసుగులో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగింది. పశు వైద్య శిబిరాల నిర్వహణ, దాణా, పశుగ్రాసం, మందులు, వ్యాక్సిన్స్ పేరుతో ప్రభుత్వ నిధులను భారీగా కొల్లగొట్టారు. ఆడిట్ అధికారుల పరిశీలనలో నాటి అవినీతి బాగోతమంతా బయటపడింది. దీంట్లో నాడు మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడుతో కుమ్మక్కైన అప్పటి పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు పాత్ర ఉందని తాజాగా లోకాయుక్తకు ఫిర్యాదు వెళ్లింది. ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో నాటి అవినీతి డొంక కదిలింది. దీనిపై నివేదిక ఇవ్వాలని పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌ను లోకాయుక్త ఆదేశించగా.. చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులను డైరెక్టర్ ఆదేశించారు. దీంతో పశు సంవర్ధక శాఖలో గుబులు రేగింది. ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకోలేక ప్రస్తుతం ఉన్న అధికారులు ఒక్కొక్కరిగా సెలవుపై వెళ్లిపోతున్నారు.

గెద్దల్లా తన్నుకుపోయారు..

2018 అక్టోబర్ 11న ఉద్దానంలో తిత్లీ తుఫాన్ విధ్వంసం సృష్టించింది. రైతు కుటుంబాలైతే చిన్నాభిన్నమయ్యాయి. రైతులకు అందించాల్సిన నష్ట పరిహారాన్ని నాటి టీడీపీ నేతలు బాధితుల ముసుగులో గెద్దలా తన్నుకుపోయారు. నాటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం ప్రకారంగా కాకుండా టెక్కలిలోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్లు ఏర్పాటు చేసి, ఉద్యానవన శాఖ అధికారులను దగ్గర పెట్టుకుని తమకు నచ్చిన, కావల్సిన రైతులు, బినామీల పేర్లను ఎక్కించి వారికే పరిహారం వచ్చేలా చేశారు. భూముల్లేని టీడీపీ సానుభూతి పరులకు భూములున్నట్టుగా చూపించి, తక్కువ భూమి ఉన్న టీడీపీ శ్రేణులకు ఎక్కువ భూమి ఉన్నట్టుగా నమోదు చేసి, పల్లం భూమిని మెట్ట భూమిగా నమోదు చేసి, పంచాయతీకి చెందని వ్యక్తులను స్థానికంగా చూపించి అడ్డగోలుగా పరిహారాన్ని కొట్టేశారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బాధితులు వరుసగా ఫిర్యాదులు చేస్తుండటంతో విచారణకు ఆదేశించారు. 2018లో తయారు చేసిన జాబితాలో లక్షా 6వేల 800మంది నష్టపోయినట్టు పేర్కొనగా, దానిని విచారణ చేపట్టేసరికి 90,789 మంది మాత్రమే అర్హులున్నట్టు తేల్చారు. మిగతా 16 వేల మంది వరకు అనర్హులే ఉన్నారు. దీంతో వైఎస్ జగన్ ప్రభుత్వం పెంచిన పరిహారం రూ.182.60 కోట్లు కూడా విచారణ అనంతరం వడబోసిన జాబితాలో వారికే ఇచ్చారు.

రిటైర్డ్ టీచర్ ఫిర్యాదుతో..

రైతుల పేరిట జరిగిన దోపిడీ మరవకముందే నాడు పశువుల పేరుతో జరిగిన అవినీతి.. ఓ రిటైర్డ్ టీచర్ చేసిన ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. పశు శిబిరాల నిర్వహణ, దాణా, పశుగ్రాసం, మందులు, వ్యాక్సిన్స్ పశు యజమానులకు అందించినట్టుగా చూపించి కోట్లాది రూపాయలు స్వాహా చేశారని రిటైర్డు ఉపాధ్యాయుడు కంచరాన ప్రసాదరావు నేరుగా కర్నూలులో ఉన్న లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో కీలక సూత్రధారి నాటి పశు సంవర్ధక శాఖ జేడీ ఎం.వెంకటేశ్వర్లు అని ఫిర్యాదులో స్పష్టం చేశారు. అందుకు తగ్గ ఆధారాలు సమర్పించారు. ముఖ్యంగా 2018 అక్టోబర్‌లో జరిగిన లావాదేవీలపై ఆడిట్ అధికారులు గుర్తించిన లోపాల నివేదికను అందజేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న లోకాయుక్త ఆడిట్ రిపోర్టుతో పాటు కంచరాన ప్రసాదరావు చేసిన ఫిర్యాదును నేరుగా పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌కు పంపించి నవంబర్ 17లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

అప్పటి జేడీపై ప్రేమ..

వాస్తవంగా టీడీపీ హయాంలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన వెంకటేశ్వర్లుపై అప్పటికే ఏసీబీ కేసు ఉంది. 2002లో ఎచ్చెర్లలో డాక్టర్‌గా పనిచేసినప్పుడు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. దీంతో సస్పెండయ్యారు. 2014లో ప్రూవ్ కావడంతో జైలు శిక్షతో రూ.30వేల జరిమానా విధించడమే కాకుండా డిస్మిస్ చేయాలని కోర్టు ఆదేశాలిచ్చింది. దానిపై హైకోర్టుకు అప్పీలుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఆ సమయంలో టీడీపీ ప్రభుత్వం ఉండటంతో వెంకటేశ్వర్లను సొంత జిల్లాలోనే ఇన్‌చార్జి జేడీగా నియమించారు. వారితో దందా చేయించారు.

సెలవుపై ప్రస్తుత అధికారులు

లోకాయుక్తకు ఫిర్యాదు మేరకు అప్పటి జేడీగా పనిచేసిన వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకుని, ఆడిట్ అధికారులు తేల్చినట్లు నిధులు రికవరీ చేసి, నివేదిక ఇవ్వాలని ప్రస్తుత అధికారులను డైరెక్టర్ ఆదేశించారు. దీంతో ఏం చేయాలో పాలుపోక ఇప్పటికే ఒక జాయింట్ డైరెక్టర్ సెలవుపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో వచ్చిన డిప్యూటీ డైరెక్టర్ కూడా నాకెందుకీ తలనొప్పి అని సెలవు పెట్టేశారు.

- ప్రకృతి వైపరీత్యాల సమయంలో కలెక్టర్ అనుమతి తీసుకుని 2245 హెడ్ ఆఫ్ అకౌంట్ నుంచి రూల్ 27 ప్రకారం అడ్వాన్సు బిల్లు పెట్టి నిధులు డ్రా చేయాలి. కానీ, ఇక్కడలా చేయలేదు. కలెక్టర్ అనుమతి తీసుకోకుండా అచ్చెన్నాయుడు, ఓఎస్‌డీ పోలినాయుడు మౌఖిక ఆదేశాలతో ఇష్టారీతిన నిధులు వినియోగించారు.
- రూ.5.63కోట్లుకు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ కోసం కలెక్టర్‌కు నోట్ ఫైల్ పెట్టాలి. అలా చేయలేదు. నేరుగా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌కు పెట్టారు. దీనిపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కలెక్టర్ అనుమతి ఇవ్వాలి, నాకు ఇచ్చే అధికారం లేదు అని అప్పటి డైరెక్టర్ చెప్పేశారు. అయినప్పటికీ ఉత్తర ప్రత్యుత్తరాలు జరగకుండా 'పని' కానిచ్చేశారు.
- హెడ్ ఆఫ్ అకౌంట్ నుంచి పశు సంవర్ధక శాఖ జేడీ ఖాతాకు అడ్డగోలుగా రూ.6కోట్ల 21లక్షల 25వేల 250 సొమ్ము మళ్లించారు. అందులో 5,63,29,029 ఖర్చు చేసినట్టు చూపించారు. ప్రత్యేకంగా క్యాష్ బుక్ నిర్వహణ చేయలేదు.
- రూ.5.63 కోట్లకు సంబంధించి స్టాక్ అండ్ ఇష్యూ రిజిస్టర్లు నిర్వహించలేదు.
- మండల స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీతో బాధితుల పశువులను గుర్తించాలి. ఆ నష్టాన్ని పంచాయతీల్లో ప్రదర్శించాలి. ఇదంతా అప్పుడు జరగలేదు. బాధితులకు దాణా సరఫరా చేసినట్టు చూపించేశారు.
- పశు వైద్యశాల పరిధిలో జరిగిన నష్టంతో పాటు ఎంత దాణా సరఫరా చేయాలో క్షేత్రస్థాయి నుంచి ఇండెంట్ తీసుకోవాలి. అదేమి చేయకుండా జిల్లా కార్యాలయ స్థాయిలోనే క్షేత్రస్థాయి నుంచి వచ్చినట్టుగా ఇండెంట్లు సృష్టించేసి దాణా స్కామ్ చేశారు.
- పశు వైద్యశాల నుంచి ఎన్ని పశువులు ఇబ్బంది పడ్డాయి, ఎంతమంది రైతులకు, ఎన్ని పశువులకు ఎంత మందులు కావాలన్న ఇండెంట్‌ను క్షేత్రస్థాయి నుంచి తీసుకోవాలి. అలాకాకుండా నేరుగా జేడీ ఆఫీస్ నుంచే ఇండెంట్ పేరుతో రిక్వైర్‌మెంట్ పెట్టేసి నిధులు కొల్లగొట్టేశారు.
- దాణా కొనుగోలు చేయాలంటే ముందు క్వాలిటీ ల్యాబ్ రిపోర్టులు తీసుకుని పరిశీలించాక ముందుకెళ్లాలి, కానీ, ల్యాబ్ రిపోర్టులే తీసుకోకుండా గూడుపుఠాణీ నడిపించారు.
- దాణా సరఫరాలోనూ నకిలీ బాగోతం నడిపారు. సాధారణంగా పశువుల యజమానులకు గాని, క్షేత్రస్థాయి పశు సంవర్ధక శాఖ సిబ్బందికి గాని దాణా సరఫరా చేస్తే వే బిల్లు, డెలివరీ చలానాలు ఉండాలి. అలా లేకుండా నేరుగా రైతులకు ఇచ్చేసినట్టుగా రికార్డుల్లో చూపించేశారు.
- క్యాష్ బుక్‌కు, డైరెక్ట్ క్యాష్ బిల్లుకు తేడా ఉన్నట్టు ఆడిట్ అధికారులు గుర్తించారు. ఉదాహరణకు పోలాకి మండలం దీర్ఘాసి గ్రామానికి చెందిన చిరంజీవి అనే వ్యక్తి వద్ద రూ.3.45లక్షలతో గడ్డి కొనుగోలు చేసినట్టు చూపించారు. కానీ, ఆయనకు రూ.12.49 లక్షలు చెల్లించినట్టు చూపించారు. దాదాపు 9.40 లక్షల తేడాను ఆడిట్ శాఖ గుర్తించింది.
- రూ.70లక్షలతో దాణా కొనుగోలు చేయాల్సి ఉండగా రూ. 95.29 లక్షలకు కొనుగోలు చేసినట్టు చూపించారు. దాదాపు రూ. 25.29 లక్షలు పక్కదారి పట్టించారు.
- దాణా, పశుగ్రాసం కొనుగోలుకు సంబంధించి 2 శాతం టీడీఎస్ కట్టాలి. అదేమీ చేయలేదు. రూ.11.15 లక్షలతో కొనుగోలు చేసినట్టు చూపించారు తప్ప ఏమీ కట్ చేయలేదు.
- తుఫాన్ సమయంలో వాహనాలుతిరిగినట్టుగా చూపించారు. లాగ్ బుక్స్ గాని, వాహనాలు నెంబర్లు గాని, ఓచర్సు లేకుండానే ఖర్చు చేసినట్టు చూపించారు.
- చిల్లర ఖర్చుల కింద రూ. 5.60 లక్షలు చూపించారు. వాటికి కనీస ఆధారాలు చూపించలేదు.
- మందులు కొనుగోలు చేసినట్లు రూ. 29.99 లక్షలు రికార్డుల్లో చూపించారు. వే బిల్లులు, డెలివరీ చలానాలు సమర్పించలేదు.
- రూ. 7.17 లక్షలు పచ్చగడ్డి కొనుగోలు చేసినట్టు చూపించారు. దానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలేవు.
- ఏ ఖర్చుకైనా సాధారణంగా యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలి. ఇక్కడదేమీ జరగలేదు.
- రూ.6 కోట్ల 21 లక్షల 25వేల 250 మేర హెడ్‌ఆఫ్ అకౌంట్ నుంచి డ్రా చేసి, రూ. 5,63,29,029 ఖర్చు చేసినట్టు చూపించారు. మిగిలిన సొమ్మును హెడ్ ఆఫ్ అకౌంట్‌కు జమ చేయాలి. అదేమీ చేయకుండా రూ.57,96,221 లను అలాగే ఉంచేశారు. వాటిపై వచ్చిన వడ్డీ సొమ్మును కూడా హెడ్ ఆఫ్ అకౌంట్‌కు జమ చేయలేదు. ఇదంతా ఎక్కడికెళ్లిందో పాత్రధారులకే ఎరుక.

అడ్డగోలు లావాదేవీలివి..



లోకాయుక్త ఆర్డర్ కాపీ



చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులకు ప్రస్తుత డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు



సోంపేట పరిసర గ్రామాల్లో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డులు

పెద్దపులి తిరుగుతోంది జాగ్రత్త

ఉద్దానంలో పులి సంచారం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోంపేట తహసీల్దార్ బి.ఎస్.ఎస్.సత్యనారాయణ సూచించారు. సోంపేట పరిసర గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలు దాటాక, ఉదయం 6 గంటల్లోపు ఒంటరిగా బయటకు రావద్దన్నారు. పశువులను ఇంటి పరిసర ప్రాంతాల్లో సంరక్షించుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పులి సంచారంపై ఎటువంటి సమాచారం ఉన్నా 94924 19724, 85010 08880 నంబర్లకు సమాచారం అందజేయాలన్నారు.

- కంచిలి మండలంలోని మండపల్లి, కుత్తుం పంచాయతీ గ్రామాల్లో పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో అంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎస్.హైమావతి సూచించారు. అటవీ, పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు. సమాచారం తెలిస్తే కంట్రోల్ రూమ్ నంబర్ 95022 20209కు, అటవీశాఖ నంబర్ 99491 70208కు తెలియజేయాలని సూచించారు.

– సోంపేట/కంచిలి



విజయనగరం ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

అధైర్యపడొద్దు.. అండగా ఉన్నాం

రైలు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై విజయనగరంలో చికిత్స పొందుతున్న జి.సిగడాం గ్రామానికి చెందిన కీర్తి రాములమ్మ, మజ్జి రమణ, మజ్జి సూర్యకాంతం, మజ్జి అమృత, మజ్జి మోక్షా, మహంతి ఆదిలక్ష్మి, మహంతి తేజశ్రీలను బుధవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉందని భరోసా ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా ఆదుకుంటున్నారని చెప్పారు. ఈయనతోపాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలి అప్పలసూరి, అలపాన శ్రీనివాసరావు ఉన్నారు.

– జి.సిగడాం

సామాజిక జయభేరి

సగర్వంగా మోగిద్దాం

ఆమదాలవలసలో 7న సామాజిక సాధికార బస్సు యాత్ర

- విజయవంతం చేయాలని మంత్రి బొత్స, స్పీకర్ తమ్మినేని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి బొత్స. చిత్రంలో స్పీకర్ తమ్మినేని, పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్ తదితరులు

ఆమదాలవలస రూరల్/ఆమదాలవలస: ప్రజలకు సామాజిక న్యాయం జరగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆమదాలవలస మండలం కొర్లకోట సమీపంలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్ర సన్నాహక సమావేశం స్పీకర్ తమ్మినేని సీతారాం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లోనూ యాత్ర జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని వర్గాలకు సంక్షేమం అందించిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మంత్రి వర్గ విస్తరణ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్లు, ట్రస్టు చైర్మన్లు, మార్కెట్ యార్డుల్లో అన్నింటిలోనూ అందరికీ సామాజిక న్యాయం పాటిస్తూ పదవులు అందించారని గుర్తు చేశారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో మధ్యవర్తులు లేకుండా, అవినీతికి ఆస్కారం కాకుండా ఆమదాలవలస నియోజకవర్గానికి సుమారు రూ.1200 కోట్లు అందించినట్లు వివరించారు. అన్ని వర్గాలకు చేసిన మంచిని చెప్పేందుకే సామాజిక సాధికార యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఆమదాలవలసలో ఈ నెల 7న జరగబోయే బస్సు యాత్ర విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 9 నుంచి ప్రతి సచివాలయం పరిధిలో 'ఈ రాష్ట్రానికి జగనన్నే ముఖ్యమంత్రి కావాలి' అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులతో పాటు పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని పార్టీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, డీసీసీబీ చైర్మన్ డోల జగన్, జెడ్పీటీసీ సభ్యులు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, లోలుగు కాంతారావు, బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేకాహ్వానితులు కేవీజీ సత్యనారాయణ, కర్నేన నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం..



బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక న్యాయం పాటించిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ. రాజకీయపరంగా అన్ని వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యమిస్తోంది. సామాజిక న్యాయం పాటించి 60 శాతం నామినేటెడ్ పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు కట్టబెట్టింది.

– ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్సీ, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు


సంక్షేమాన్ని వివరించేందుకే..



ప్రజలకు జరిగిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్రను నిర్వహిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ప్రచార ఆర్భాటంతో శంకుస్థాపనలు చేసి పనులు విస్మరించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవ శిలాఫలకాలు ఆవిష్కరించేలా అడుగులు వేస్తున్నాం. పాదయాత్ర, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని 99 శాతం అమలు చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుంది. ఈ నెల 7న జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ కేడర్ శక్తి వంచన లేకుండా కృషి చేయాలి.

– తమ్మినేని సీతారాం, శాసనసభ స్పీకర్

సైనికుల్లా పనిచేయాలి..



ఎన్నికలు ఏవైనా వైఎస్సార్‌సీపీదే విజయం. అందరూ సమష్టిగా పనిచేస్తే విజయం సాధించడం మరింత సులువుగా మారుతుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలను ప్రజలకు తెలియజేసేందుకే బస్సు యాత్రను నిర్వహిస్తున్నాం. వైఎస్సార్‌సీపీ రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో హవా కొనసాగిస్తుంది. ఇందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే

తొలిరోజు పింఛన్ల పంపిణీ 60 %



శ్రీకాకుళం మండల వీధిలో వృద్ధురాలు సనపల జానకమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కృష్ణప్రసన్న

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వైఎస్సార్ పింఛను కానుక పథకంలో భాగంగా లబ్ధిదారులకు తొలి రోజు బుధవారం 60 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేశారు. 3,21,967 మందికి గాను 1,93,169 మందికి డబ్బులు అందించారు. ఇంకా పంపిణీ జరుగుతోంది. పలు చోట్ల పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, ఏఓ బి.వి.వి.ఎస్.దొర పరిశీలించారు.

క్లుప్తంగా

నౌతలలో ఐటీడీఏ పెట్రోల్ బంక్



స్థల పరిశీలన చేస్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్

సారవకోట: నౌతల గ్రామంలో సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్‌కు జాయింట్ కలెక్టర్ నవీన్ బుధవారం స్థల పరిశీలన చేశారు. ముందుగా సర్వే నంబర్ 114-2లో ఉన్న ప్రభుత్వ స్థలం 37 సెంట్లను పరిశీలించి తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఆయనతో పాటు తహశీల్దార్ హనుమంతరావు, డీటీ మధుబాబు, సర్వేయర్ కృష్ణారావు ఉన్నారు.

కొండచిలువ కలకలం



తుప్పల్లో ఉన్న కొండచిలువ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో బుధవారం భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. 8వ వార్డు నర్సిపురం గ్రామానికి పలాస రైల్వేస్టేషన్‌కు మధ్య తుప్పల్లో కదల్లేని స్థితిలో కనిపించడంతో స్థానికులు పరుగులుపెట్టారు. సుమారు 12 అడుగుల పొడవు ఉండటంతో కాశీబుగ్గ ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి చాకచక్యంగా పట్టుకుని రామకృష్ణాపురం సమీపంలోని రిజర్వు ఫారెస్టులో విడిచిపెట్టారు.

కరాటే జట్టు ఎంపికలు రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర స్థాయి అండర్ -19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో పాల్గొనే కరాటే క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 3న నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీడీ ఎస్.రమణ బుధవారం తెలిపారు. డీఈవో కార్యాలయంలో సమీపంలోని కరాటే స్కూల్‌లో ఉదయం 10 గంటలకు ఈ ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల బాలబాలికలు పాల్గొనాలని కోరారు. అండర్ -19 సెపక్‌తక్ర జట్టు ఎంపిక ఎన్టీఆర్ ఎంహెచ్ పాఠశాలలో ఈ నెల 3న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేషన్ పంపిణీపై డీఎస్‌ఓ విచారణ

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో అక్టోబర్‌లో 58 మంది లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయకపోవడంపై బుధవారం జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వెంకటరమణ విచారణ నిర్వహించారు. ఎండీఎం వాహనం ద్వారా సరుకులు పంపిణీ కాకపోవడంతో లబ్ధిదారులు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ద్వారా కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎస్‌ఓ విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ గణేష్, జేసీఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్, నాయకులు నిక్కు రాజశేఖర్, రామకృష్ణ, జాడ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధికి కృషి



బుడుమూరు రాజేష్‌ను సన్మానిస్తున్న వీసీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఇటీవల జేఎన్‌టీయూజీవీలో సిండికేట్ మెంబర్‌గా డాక్టర్ బుడుమూరు రాజేష్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ వెంకట సుబ్బయ్య బుధవారం రాజేష్‌ను సత్కరించారు. వర్సిటీ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు, ఐటం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళలకు ఊపిరి



గత ఏడాది ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన 'నాన్నా నేనొచ్చేస్తా' నాటికలో ఓ సన్నివేశం (ఫైల్)

- సుమారు పాతికేళ్లుగా కళలను ఆదరిస్తున్న శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య
- నాటిక ప్రదర్శనలు, కళాకారులకు సత్కారాలు
- ఈ నెల 3 నుంచి 5 వరకు రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: కనుమరుగవుతున్న కళలకు ఊపిరిపోస్తూ శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య దిగ్విజయంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా నాటికలను బతికించుకోవాలనే తపనతో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రతి నెలా ఒక ప్రదర్శన ఏర్పాటు చేస్తు నాటక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతోంది. ప్రతినెలా కళాప్రదర్శనలు ఇస్తూ, మరోవైపు పేద, వృద్ధ కళాకారులకు పింఛను రూపంలో ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ మరొకటి లేదు.

నెలవారీ సాంస్కృతిక విభాగం ఏర్పడిందిలా..

1978లో కళాకారుల సంక్షేమం కోసం రంగస్థల కళాకారుల సమాఖ్య ఏర్పడింది. గతంలో ఎవరికివారు నాటక సమాజాలను ఏర్పాటు చేసుకొని ప్రదర్శనలు ఇస్తుండేవారు. అయితే ప్రభుత్వం నుంచి కళాకారులకు ఇళ్లు, ఇళ్లస్థలాలు రావాలంటే జిల్లా వ్యాప్తంగా సమాఖ్య ఉండాలనే ఉద్దేశంతో సమాఖ్య ఏర్పాటు చేశారు. అప్పట్లో ఎక్కువగా ప్రదర్శనలు ఇస్తున్న రవికళామందిర్, శ్రీశైనా ఆర్ట్స్, సోషల్ యూత్ కల్చరల్ ఆర్ట్స్‌తో పాటుగా మరికొన్ని నాటక సమాజాలు కలిశాయి. బాపూజీ కళామందిర్ పునరుద్ధరణలో తమ వంతు కృషి చేసినందుకు శ్రీకాకుళం మున్సిపాలిటీ ప్రతినెలా మొదటి శనివారం కార్యక్రమాలు ఏర్పాటు చేసుకునేందుకు స్వచ్ఛందంగా అంగీకరించింది. 1999 ఆగస్టు 15న నెలవారీ సాంస్కృతిక విభాగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. శ్రీకాకుళరంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమాలను నిర్వహించేందుకు నాందిగా బాపూజీ కళామందిర్ పునర్నిర్మాణంగా చెప్పవచ్చు. శిథిలావస్థలో ఉన్న కళామందిర్ పునర్మిణానికి సమాఖ్య సభ్యులు చందాలు వేసుకొని రూ.25వేల పెట్టుబడి పెట్టగా.. కళాభిమానులు, పట్టణ ప్రముఖులు, ఎంపీ నిధులు కలసి సుమారు రూ.16లక్షలతో పనులు పూర్తి చేశారు. నాటి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న దూడ భవానీ శంకర్ కౌన్సిల్ తీర్మానంతో సమాఖ్యకు ప్రతి నెలా మొదటి శనివారం ఉచితంగా ప్రదర్శనలకు ఇచ్చేందుకు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. నాటి నుంచి కళాకారులు ప్రతినెలా ఒక సాంఘిన నాటక ప్రదర్శన ఏర్పాటుకు కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీకి మొదటి అధ్యక్షుడిగా భవానీ శంకర్, కన్వీనర్‌గా చిట్టి వెంకటరావు వ్యవహరించారు. మొదటి ప్రదర్శన 1999 నవంబరులో జరిగింది. 24 ఏళ్లుగా 288 నెలలు కళాప్రదర్శనలు నిర్వహించారు. తాజాగా 289వ నెల కార్యక్రమాలకు సిద్ధమైంది.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి పోటీలు..

289వ నెల సందర్భంగా రాష్ట్రస్థాయి నాటిక పోటీలను నవంబరు 3 నుంచి 5 వరకు నిర్వహిస్తున్నారు. 3న విశాఖ, జాస్మిన్ ఆర్ట్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ 'మేము మనుషులమే', చిలకలూరిపేటకు చెందిన ది అమెచ్యూర్స్ డ్రమటిక్ అసోషియేషన్ 'ఏడనున్నాడో-ఎక్కడున్నాడో', 4న విశాఖ పార్వతీనగర్‌కు చెందిన కళాభినయ 'కన్నెర్ర', చిలకలూరిపేటకు చెందిన సుక్రుతి క్రియేషన్స్ 'మిణుగురు వెలుగులు', 5న నెల్లూరు, క్రాంతి ఆర్ట్ థియేటర్స్ 'ఓమనిషి కావాలి', ఎన్టీఆర్ఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సౌజన్యంతో కత్రపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ 'విముక్తి' నాటికలు ప్రదర్శించనున్నారు.. అదే రోజున విజేతలకు బహుమతులు అందజేస్తారు.

కొత్త నాటికలు రావాలి..



ప్రతి ఏడాది పరిషత్ నాటికల సందర్భంగా కొత్త నాటికలు రావాలనే ఉద్దేశంతో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నాం. ప్రదర్శనకు ఎంపికైన కొత్తనాటిక రచయితలకు ప్రోత్సాహకంగా నగదు పారితోషికం అందిస్తున్నాం. మాకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. - చిట్టి వెంకటరావు, అధ్యక్షుడు, నెలవారీ సాంస్కృతిక విభాగం

ఎన్నో కళారూపాలు..

పౌరాణిక, సాంఘిక నాటకాలు ప్రదర్శనలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు, జానపద కళారూపాల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా రాష్ట్రేతర ప్రాంతాల నుం కళాకారులను రప్పించి ప్రేక్షకులకు అభిరుచికి తగ్గట్లు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. కళాకారులు అప్పారావునాయుడు, కుప్పిలి భాస్కరరావుల జ్ఞాపకార్థం నాటక పరిషత్తును మొదటిసారిగా ఎగ్జిబిషన్ కళా ప్రాంగణంలో నిర్వహించారు.

నాటక పోటీల నిర్వహణ..

జిల్లా కళాభిమానుల కోసం రాష్ట్ర ఫిల్మ్, టెలివిజన్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో 2008లో బంగారు నంది బహుమతి పొందిన నాటకాలను మూడురోజుల పాటు ప్రదర్శించారు. తెలుగు నాటక రంగ దినోత్సవం, ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా 'ముంగిట సన్మానం' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 'అజోవిభో' కందాళం ఫౌండేషన్, కళాకారుల సమాఖ్య సంయుక్తంగా రాష్ట్ర స్థాయి నాటక పోటీలను దిగ్విజయంగా నిర్వహించింది. పోటీల నిర్వహణలో ఎన్నో విషయాలను నేర్చుకొని నాటినుంచి సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతి ఏడాది పరిషత్ నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. కొత్త రచన, మొదటి ప్రదర్శన లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తూ రచయితలను, నాటకాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రతి మేలో సీనియర్ పౌరాణిక కళాకారులు బి.ఏ.మోహనరావు సహకారంతో పౌరాణిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు.

కళాకారులకు పింఛను..

నాటరంగానికి, కళారంగానికి సేవలందించిన పేద, వృద్ధ కళాకారులకు పింఛను రూపంలో సహకారం అందిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ కాకుండా సమాఖ్య సభ్యులు మాత్రం ప్రతినెలా మొదటి శనివారం 30 మందికి రూ.400 చొప్పున అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వెయ్యిమంది కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. వీరిచ్చిన గుర్తింపు కార్డులతో ప్రభుత్వ పింఛను పొందుతున్నారు.

4న శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ హాస్పిటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ శిక్షణా సంస్థ ప్రాంగణంలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళాకు ఎస్‌బీఐ కార్డ్స్, ఎం/ఎస్ సుస్వదీప్ ఆగ్రో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఎస్‌బీఐ కార్డ్స్‌లో 30 బ్రాంచ్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్స్‌కు (జీతం రూ.16 వేల నుంచి రూ.25 వేలు వరకు) ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. 30 బ్రాంచ్ రిలేషన్ మేనేజర్ పోస్టులకు డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 ఏళ్ల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 20 ఖాళీలున్న టెలీ కాలర్స్, బకెండ్స్ పోర్ట్ టీం (జీతం రూ.16వేలు నుంచి రూ.25 వేలు వరకు) ఇంటర్మీడియట్/డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 ఏళ్ల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎం/ఎస్ సుస్వదీప్ ఆగ్రో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 10 ఖాళీలున్న సేల్స్ ఎగ్జిక్యూటివ్‌కు (జీతం రూ.14500 నుంచి రూ.16500 వరకు) ఇంటర్మీడియట్/డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 ఏళ్ల పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 30 డెలివరీ బాయ్స్ పోస్టులకు (జీతం రూ.10000 నుంచి రూ.12000) 10వ తరగతి/ఇంటర్మీడియట్ విద్యార్హత కల్గి ఉండాలన్నారు. 5 కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు (జీతం రూ.12000) ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 నుండి 35 ఏళ్ల పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. 10 మర్చండైజర్ పోస్టులకు (జీతం రూ.10000) పదో తరగతి/ఇంటర్మీడియట్ విద్యార్హత కల్గి ఉండి 18 నుంచి 35 ఏళ్ల పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈ నెల 4న ఉదయం 10.30 గంటలకు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డ్‌తో హాజరుకావాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్ఎంయూ జోనల్ కమిటీ పిలుపు మేరకు జిల్లా ఎన్ఎంయూ నాయకులు బుధవారం శ్రీకాకుళం ఆర్టీసీ డీపీటీవో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శులు జి.కామేశ్వరరావు, ఎస్.శిమ్మయ్యలు మాట్లాడుతూ పీడీ 1/2019 సర్క్యులర్ తక్షణమే అమలు చేయాలని, డిపో స్పేరులో సస్పెండైన ఉద్యోగులకు అదే డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని, ఓటీ అలవెన్స్‌లు అదే నెల జీతంతో కలిపి ఇవ్వాలని, అన్ని రకాల సిక్‌లపై జీతాలు చెల్లించాలని, ఎన్ఎంయూ నాయకులు, సిబ్బందిపై కక్షసాధింపు చర్యలు వీడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు పీఆర్‌కే రావు, వై.అప్పయ్య, శ్రీకాకుళం 1, 2, టెక్కలి, పలాస డిపోల అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ రావు, కె.నరసింహులు, బీటీవీఎస్ రావు, హెచ్‌వి మూర్తి, బీడీజే రావు, టీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌కు అనుమతిస్తే సంబరాలా!

- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: కంటి ఆపరేషన్ కోసం చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తే టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవటం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం ఆమదాలవలసలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం సరిగా లేదని ఎవరు కోర్టుకు విన్నవించుకున్నా బెయిల్ వస్తుందనే విషయం టీడీపీ నేతలు గుర్తించాలన్నారు. ఢిల్లీ రాష్ట్ర మంత్రి సత్యేంద్ర, లాలూ ప్రసాద్ యాదవ్, వరవరరావు లాంటి వారికి కూడా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని కోర్టుకు విన్నవించగా వారికి కూడా బెయిల్ మంజూరైందని గుర్తు చేశారు. కేసులో మెరిట్స్ గురించి వాదించటం లేదని, ఎంత సేపూ సాంకేతిక అంశాలపైనే వాదిస్తున్నారని, దీనిని పరిశీలిస్తే చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో ముడుపులు అందాయని స్పష్టమవుతోందన్నారు. చంద్రబాబు మళ్లీ జైలుకెళ్లడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ముద్దాడ ఈశ్వరరావు, దానేటి రామ్మోహన్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



అమరజీవి చిత్రపటానికి పూలమాల వేస్తూ నివాళి అర్పిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం రూరల్/శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం క్రైమ్: అమరజీవి పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలని, ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పెదపాడులోని మంత్రి ధర్మాన ప్రసాదరావు క్యాంపు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టరేట్ ఆవరణలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పాత బస్టాండ్ కూడలికి చేరుకుని అక్కడి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎస్పీ జి.ఆర్.రాధిక పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాధు వైకుంఠరావు, బగ్గు అప్పారావు, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, జిల్లా ఖజానా శాఖ అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏవో రాజేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, సెబ్ అదనపు ఎస్పీ వి.నాగమణికంఠ, అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు యర్రగుంట శృతి, డి.ప్రసాదరావు, సీహెచ్‌జీవీవీ ప్రసాదరావు, సీఐ పి.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు డి.సురేష్, ఉమామహేశ్వరరావు, కె.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మందికి సేవా పతకాలు



జె. తిప్పేస్వామి, అడిషనల్ ఎస్పీ



పాచిపెంట ఢిల్లీరావు, ఏఎస్ఐ, ట్రాఫిక్ పీఎస్



గంగారావు, పీసీ, వన్‌టౌన్



ఎ.సురేష్, డ్రైవింగ్ ఆపరేటర్ (ఫైర్)



టి.రాంబాబు, లీడింగ్ ఫైర్‌మేన్



ఉమామహేశ్వర రావు, విజిలెన్సు ఆర్‌వీ అండ్ ఈవో

శ్రీకాకుళం క్రైమ్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖకు ఎనిమిది మందికి సేవా పతకాలు వరించాయి. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన విడుదలైంది. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జగన్నాథం తిప్పేస్వామి, ట్రాఫిక్ పీఎస్ ఏఎస్ఐ పాచిపెంట ఢిల్లీరావు, ఏఆర్ హెచ్‌సీ సారిపల్లి అప్పలరాజు, శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పీసీ ఇచ్ఛాపురం గంగారావు, రణస్థలం ఫైర్‌స్టేషన్ డ్రైవింగ్ ఆపరేటర్ ఎ.సురేష్, కోటబొమ్మాళి లీడింగ్ ఫైర్‌మెన్ టి.రాంబాబు, విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం ఆర్‌వీ అండ్ ఈవో ఎస్.ఉమామహేశ్వరరావు, శ్రీకాకుళానికి చెందిన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు కానిస్టేబుల్ ఆర్.శ్రీనివాసరావులకు పతకాలు దక్కాయి. వీరిని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ప్రత్యేకంగా అభినందించారు.

రాజకీయ పార్టీల విజ్ఞప్తులకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితాకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని త్వరగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ ఇంజనీర్ల పర్యవేక్షణలో జరుగుతున్న బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్ల ముదింపు ప్రక్రియను వివరించారు. దాదాపు 70 శాతానికి పైగా యంత్రాల పనితీరును పరిశీలించామని, రెండు మూడు శాతం పరికరాలు సాంకేతికంగా విఫలమైనట్లు గుర్తించామని, వాటిని ప్రక్రియ నుంచి తొలగించామని వివరించారు. జిల్లాకు చేరిన కొత్త పరికరాలతో పాటు మిగిలిన వాటిని గడువులోగా పరిశీలిస్తామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 27 వేల క్లెయిముల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో బూత్ లెవెల్ అధికారులతో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రౌతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), పీఎంజే బాబు (టీడీపీ), చల్లా వెంకటేశ్వరరావు (బీజేపీ), సోమేశ్వరరావు (బీఎస్పీ) పాల్గొన్నారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

కొత్తూరు: మండలంలోని బలద గ్రామానికి చెందిన కంచరాం రత్నాలు రోడ్డు దాటుతుండగా హడ్డుబంగి నుంచి కాశీనగర్ వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఒడిశా రాష్ట్రం కిడిగాంకు చెందిన ఆటో డ్రైవర్ కడగల తవిటినాయుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ అజాద్ అహమ్మద్ తెలిపారు

నవజాత శిశువుల సంరక్షణకు ప్రాధాన్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: నవజాత శిశువులను సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. బుధవారం నవజాత సంరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాలులో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజాత శిశువుల మరణాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు శ్రీదేవి, ఫణికుమార్, భాస్కరరావు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, మెజిస్ట్రేట్లు శ్రీవిద్య, భరణి, శారదాంబ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వి.రమణ, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జాన్సీ భాయ్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

పొందూరు: మండలంలోని తోలాపి గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో రాపాక గ్రామానికి చెందిన బూరాడ రామినాయుడు, ఆయన భార్య చిన్నమ్మడులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్సులో శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు మలకాం గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనచోదకుడు రాజశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

నేవీ అధికారి ఆకస్మిక మృతి



అంపోలు నాగరాజు(ఫైల్)

మందస: మండల కేంద్రం మందసకు చెందిన నేవీ అధికారి అంపోలు నాగరాజు(42) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. నేవీలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆయన వృత్తిరీత్యా విశాఖపట్నంలో ఉంటున్నారు. అక్కడే అనారోగ్యానికి గురి కాగా స్నేహితులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నాగరాజు మరణించినట్టు వైద్యులు చెప్పడంతో ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని మందసకు తీసుకువచ్చారు. నాగరాజుకు భార్య ఆశ, ఇద్దరు కుమార్తెలు. ఆయన తండ్రి అంపోలు రామానందం రిటైర్డ్ ఉపాధ్యాయుడు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. నాగరాజు మృతదేహాన్ని చూడడానికి బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

'శాయ్'కు పలాస క్రీడాకారుల ఎంపిక



కోచ్‌లను సత్కరిస్తున్న నిర్వాహకులు

కాశీబుగ్గ : యానాంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ఇన్‌స్టిట్యూట్‌కు పలాసకు చెందిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు చల్లా రేవంత్, చల్లా రమేష్‌లు ఎంపికయ్యారు. పలాస రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు అండర్-17 బాలుర విభాగంలో ఎంపికైన వీరితో పాటు కోచ్‌లు ఎం.మల్లికార్జునరావు, షేక్ మహమ్మద్‌లను బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధికార ప్రతినిధి గుజ్జు జోగారావు, రైల్వే ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి శ్రీరెడ్డి, కిరణ్‌కుమార్, తవిటయ్య, సోము, మాధవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.